

**పౌరుల హక్కుల సంక్షేమం కొరకు బయలుదేరిన యూత్ కాంగ్రెస్ నాయకులు**

2 లో




మంగళవారం 29 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:11

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం


# ప్రజా జ్యోతి దినపత్రిక ఎఫెక్ట్

## - మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతు విద్యుత్ సమస్యకు పరిష్కారం!

## - స్పందించిన విద్యుత్ మండల అధికారి సిద్ధిరాజ్

## - బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ మంజూరు..

## - ప్రజా జ్యోతి జాతీయ దిన పత్రికకురైతు కృతజ్ఞతలు


ప్రజాజ్యోతి
28 Sep 2026 - Page 4

మూడున్నరేళ్లుగా బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం నిరీక్షణ!

డీడీ కోసం రూ.17 వేల చెల్లింపు.. అయినా కనెక్షన్ రాలేదంటున్న రైతు

వెంచర్లకు నెల రోజుల్లో పనులు.. రైతు సమస్యకు మాత్రం ఏళ్ల తరబడి జాప్యమా?

కొండాపూర్ ప్రజా జ్యోతి

2023లోనే రూ.17 వేల చెల్లింపు

వెంచర్లకు వేగం.. రైతుకు జాప్యమా?

ఈ విషయంపై మండల విద్యుత్ అధికారి స్పందిస్తూ..

డీడీ చెల్లింపు నుంచి కనెక్షన్ వరకు ఏం జరిగింది?



**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మన్నాన్పల్లి గ్రామానికి చెందిన రైతు మందుల గోపాల్ మూడున్నరేళ్లుగా ఎదుర్కొంటున్న బోరు మోటార్ విద్యుత్ కనెక్షన్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. రైతు సమస్యపై ప్రజా జ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించడంతో సమస్య పరిష్కారమైందని రైతు తెలిపారు.బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం 2023లోనే డీడీ కోసం రూ.17 వేల చెల్లించినప్పటికీ, ఏళ్ల తరబడి కనెక్షన్ రాకపోవడంతో రైతు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రజా జ్యోతి దినపత్రిక వెలుగులోకి తీసుకువచ్చింది. "డీడీ కోసం రూ.17 వేల చెల్లింపు.. అయినా కనెక్షన్ రాలేదంటున్న రైతు" అనే కథనంతో రైతు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది.

వివరాలు 2లో





# మెదక్ లో భారీ నిరసన ర్యాలీ

## - స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

## - జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

**నర్సాపూర్ 28 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**

జిల్లా కేంద్రంలో ఏఐసీసీ,టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ాx= ప్రక్రియలో అక్రమాలు,ఆవకతావకలపై కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,ఇన్చార్జిలు చెరుకు శ్రీనివాస్ రెడ్డి,రాజి రెడ్డి ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో

# ప్రజా జ్యోతి దినపత్రిక ఎఫెక్ట్

మొదటిపేజీ తరువాయి


ప్రజాజ్యోతి
28 Sep 2026 - Page 4

## మూడున్నరేళ్లుగా బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం నిరీక్షణ!

డీడీ కోసం రూ.17 వేల చెల్లింపు.. అయినా కనెక్షన్ రాలేదంటున్న రైతు

వెంచర్లకు నెల రోజుల్లో పనులు.. రైతు సమస్యకు మాత్రం ఏళ్ల తరబడి జాప్యమా?

కొండాపూర్ ప్రజా జ్యోతి

2023లోనే రూ.17 వేల చెల్లింపు

వెంచర్లకు వేగం.. రైతుకు జాప్యమా?

ఈ విషయంపై మండల విద్యుత్ అధికారి స్పందిస్తూ..

డీడీ చెల్లింపు నుంచి కనెక్షన్ వరకు ఏం జరిగింది?



### అధికారుల స్పందనతో సమస్య పరిష్కారం

కథనం ప్రచురితమైన అనంతరం విద్యుత్ మండల అధికారి సిద్దిరాజ్ స్పందించి రైతు సమస్యను పరిశీలించారు. సంబంధిత సిబ్బందితో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను పూర్తి చేయడంతో రైతు బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ సమస్య పరిష్కారమైంది.మూడున్నరేళ్లుగా విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురుచూసిన తన సమస్యను ప్రజా జ్యోతి దినపత్రిక ప్రచురించడం ద్వారా అధికారులు స్పందించి పరిష్కరించారని రైతు మందుల గోపాల్ తెలిపారు.

### ప్రజా జ్యోతి జాతీయ దినపత్రికకు రైతు కృతజ్ఞతలు

తన సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజా జ్యోతి దినపత్రికకు రైతు మందుల గోపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**మూడున్నరేళ్లుగా ఎదురుచూసిన విద్యుత్ కనెక్షన్..ప్రజా జ్యోతి కథనంతో పరిష్కారం**



# మెదక్ లో భారీ నిరసన ర్యాలీ

మొదటిపేజీ తరువాయి

అనంతరం మాట్లాడుతూ సీఈసీ సొంత నిర్ణయాలతో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఓట్ల గల్లంతు విధానం ప్రజాస్వామ్యాని, దేశ సార్వభౌమత్వానికి విఘాతమని పేర్కొన్నారు.మిగిలిన ఇద్దరు కమిషనర్లు వ్యతిరేకిస్తున్నప్పటికీ సీఈసీ నిర్ణయాలు కొనసాగించడం ఎన్నికల కమిషన్ స్వయంప్రతిపత్తికి భంగం కలిగించేలా ఉందని విమర్శించారు.ఎలక్షన్ కమీషన్ ా×= పేరుతో దాదాపు దేశవ్యాప్తంగా13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ జాబితాల నుంచి తొలగించి బీజేపీ గెలుపుకు పరోక్షంగా సహకరిస్తున్నారని విమర్శించారు.ఆయన తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఫామ్-6లో కొత్త నిబంధనలు చేర్చి,ఎన్నికల కమిషన్‌ను బీజేపీ జేబు సంస్థగా మార్చి ఓటు చోరీకి పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు.దేశంలో రాజ్యాంగాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడటానికి రాహుల్ గాంధీ మొదటి నుంచీ పోరాడుతున్నారని ప్రత్యేకంగా గుర్తుచేశారు.ల






# పౌరుల హక్కుల సంక్షేమం కొరకు బయలుదేరిన యూత్ కాంగ్రెస్ నాయకులు

మొదటిపేజీ తరువాయి

**నాగలగిద్ద, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

నారాయణఖేడ్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మాలి పటేల్ శివకాంత్ పౌరుల ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కుల కొరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు నారాయణఖేడ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ శ్రేణులు బయలుదేరారు. ఎంపీ సురేష్ కుమార్ శేట్కర్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణఖేడ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాలిపటెల్ శివకాంత్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంగారెడ్డికి తరలివెళ్లారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, ఓటర్ల జాబితాలో అవకతవకలపై ప్రజల తరఫున తమ నిరసనను ఓటర్ల జాబితాలో ఓట్ల గల్లంతుపై భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, ఓటర్ల జాబితాలో అవకతవకలపై ప్రజల తరపున తమ నిరసనను తెలియజేసేందుకు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నామని తెలిపారు.



# కాశ్మీరంలో విరిసిన చిల్వర్ ఖ్యాతి

## - జాతీయ ఫెన్సింగ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లిన బృందాశ్రీ, శ్రీతన చంద్ర సాహు!


















### అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామం

సుదూర జమ్మూ కాశ్మీర్ గడ్డపై తెలంగాణ రాష్ట్రానికి, చిల్వర్ గ్రామానికి చిన్నారులు ఘన కీర్తిని చేకూర్చారు. జమ్మూ యూనివర్సిటీ వేదికగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 14వ మినీ & 8వ చైల్డ్ నేషనల్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున బరిలోకి దిగిన చిల్వర్ గ్రామానికి చెందిన క్రీడాకారులు బృందాశ్రీ, శ్రీతన చంద్ర సాహు తమ అసాధారణ పోరాట పటిమతో అద్భుత ప్రదర్శన చేశారు. దేశవ్యాప్తంగా వందలాది మంది మేటి క్రీడాకారులు విచ్చేసిన ఈ జాతీయ స్థాయి మహా సంగ్రామంలో, ఈ చిన్నారులు పదునైన ఎత్తుగడలతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ క్వార్టర్ ఫైనల్స్ (టాప్-8) వరకు అప్రతిహతంగా దూసుకెళ్లారు.

### యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రతిభామూర్తులు:

మంచిరేవులలోని ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ లో చదువుకుంటున్న ఈ చిన్నారులు చదువుతో పాటు క్రీడల్లోనూ తమ అసాధారణ ప్రతిభను చాటారు.లి బృందాశ్రీ (అండర్-10 బాలికల విభాగం): జాతీయ స్థాయి వేదికపై ఏమాత్రం బెరుకు లేకుండా అత్యంత చాకచక్యంగా ఆడి, పదునైన కదలికలతో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చింది. తృటిలో మెడల్ చేజారినప్పటికీ, భారతదేశంలోనే అత్యుత్తమ టాప్-8 క్రీడాకారిణిగా నిలిచి అందరి ప్రశంసలు అందుకుంది.లి శ్రీతన చంద్ర సాహు (అండర్-12 బాలుర విభాగం): జాతీయ స్థాయి హేమాహేమీలతో హోరాహోరీగా తలపడుతూ క్వార్టర్ ఫైనల్స్ వరకు విజయేతగా నిలిచాడు. జాతీయ వేదికపై ఇతను చూపిన చురుకుదనం యావత్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.

### కన్నవారి కష్టం.. గ్రామానికి దక్కిన గౌరవం:

ఈ చిన్నారుల అద్భుత ప్రదర్శన వెనుక వారి తల్లిదండ్రులు జంబిగే శేఖర్ మరియు స్వప్న గార్ల అండదండలు, నిరంతర ప్రోత్సాహం ఎంతగానో ఉన్నాయి. తమ పిల్లలను దేశం గర్వించే క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు వారు పడిన శ్రమ నేడు సత్ఫలితాలను ఇచ్చింది. పతకం రాకపోయినా, జాతీయ స్థాయిలో టాప్-8 జాబితాలో నిలవడం చిల్వర్ గ్రామానికి వెలకట్టలేని కీర్తిని తెచ్చిపెట్టింది.కాశ్మీరంలో మన రాష్ట్ర జెండాను ఎగరేసిన ఈ బాల సూపర్ స్టార్లకు, వారి తల్లిదండ్రులకు, మరియు స్కూల్ యాజమాన్యానికి చిల్వర్ గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక అభినందనలు. ఈ జాతీయ స్థాయి అనుభవంతో భవిష్యత్తులో వీరు ఒలింపిక్స్ వేదికలపై భారతదేశానికి బంగారు పతకాలు సాధించాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

# ఆలయంలో చోరీ,,

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 28:**

శివ్వంపేట మండలంలోని సికింద్లాపూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం (సెప్టెంబర్ 27) రాత్రి చోటుచేసుకున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి గర్భగుడిలోని స్వామివారి వెండి కవచం,వెండి కిరీటాలు,వెండి శంఖు చక్రాలు,వెండి అభ్యాసం,వెండి మకరతోరణం,వెండి స్వామివారి పాదాలు,వెండి పంచపాత్రలు,వెండి శతగోపం తదితర వస్తువులను అపహరించినట్లు పేర్కొన్నారు. అలాగే అమ్మవారికి సంబంధించిన బంగారు పుస్తెలను కూడా దొంగిలించినట్లు తెలిపారు.వాటి బరువు సుమారు అర తులం ఉంటుందని ఆలయ సిబ్బంది తెలిపారు.ఈ ఘటనపై ఆలయంలో పనిచేస్తున్న మడపాటి ధనుంజయ్ శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివ్వంపేట ఎస్సై మధుకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఆలయంలోని పరిస్థితులను పరిశీలించిన పోలీసులు దొంగతనానికి సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# చీకుమద్దూర్ లో బలరామ జయంతి వేడుకలు

**హత్నూర 28 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**

మండల పరిధిలోని చికుమద్దూర్ గ్రామంలో సోమవారం నాడు బలరామ జయంతి వేడుకలు గణనీయంగా నిర్వహించారు.భారతీయ కిసాన్ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీ వీ మాధవ రెడ్డి ఆధ్వర్యంలో బలరామ జయంతి ఉత్సవాలలో భాగంగా భారత మాత మరియు బలరాముని చిత్రపటాలకు పూజ చేసి భారతీయ కిసాన్ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది తదనంతరం వారు మాట్లాడుతూ రైతుల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు అదే విధంగా ప్రభుత్వం రైతు బీమా నీ పునరుద్ధరించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు వీరా రెడ్డి పోశెట్టి శ్రీనివాస్ రెడ్డి శ్రీశైలం రాంరెడ్డి శివ్వ గౌడ్ సుబన్ రెడ్డి పాండు ప్రతాప్ రెడ్డి అరుణ్ పోచయ్య నరేందర్ రెడ్డి శేఖర్ బాబు మేబు ఏళ్ళదాసు నవీన్ వెంకయ్య నారాయణ రెడ్డి చంద్రయ్య బలయా హుసేన్ తదితర రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.




# సీఎంఆర్ఎఫ్‌తో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

**రాయికోడ్ సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**



అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.సింగీతం గ్రామంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.72,500 విలువైన చెక్కులను ఇద్దరు లబ్ధిదారులకు సోమవారం అందజేశారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశాల మేరకు రఫీక్, తలారి మోహన్‌లకు చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింలు, కాంగ్రెస్ నాయకులు అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మండల తాజా మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్, సింగీతం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాజిద్,రాయికోడ్ గ్రామ మాజీ సర్పంచ్ కేదార్‌నాథ్ పటేల్, శ్రీ వీరభద్రేశ్వర ఆలయ చైర్మన్ సతీష్ కులకర్ణి, మండల నాయకులు మొహమ్మద్ రఫీక్, రాజు,కురుమ రాజేందర్ పటేల్,సంగమేష్,వీరేశం రాజు,సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోహన్‌తో పాటు పలువురు నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యలపై వినతులు

**రాయికోడ్ సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవిస్తూ వినతిపత్రాలు అందజేశారు.తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్య, రెవెన్యూ, పింఛన్లు తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం. షరీఫ్, ఎంఈఓ నర్సిములు, పీఆర్ ఏఈ దేవయ్య, ఎక్సైజ్ శాఖ ఎస్సై నాగలక్ష్మి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.




# నర్సాపూర్ లో 108 మంది రూ.51లక్షల CMRF చెక్కుల పంపిణీ

**నర్సాపూర్ 28 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**

నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణా గార్డెన్స్‌లో సోమవారం నాడు నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి 108 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.51 లక్షల విలువైన జవీ=ఖీ చెక్కులను అందజేశారు.అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద,మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా అందించడం జరుగుతోందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# అధికారులు సిద్ధం.. ప్రజల నుంచి స్పందన శూన్యం. ప్రజావాణిలో ఖాళీ చేతులే.. ఒక్క దరఖాస్తూ రాలేదు.

**కల్హేర్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):**




కల్హేర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజల సమస్యలను స్వీకరించేందుకు అధికారులు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రజల నుంచి ఎలాంటి దరఖాస్తులు అందలేదని ఎంపీడీవో హరినంద్రావు,తెలిపారు. తహసీల్దార్ కే. శివ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సురేష్, డీటీ పవన్‌కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనమే.. రైతుకు బంగారు బాట!

## వరి విత్తనోత్పత్తిలో మెలకువలపై రైతులకు శిక్షణ

**అందోల్, సెప్టెంబర్28, (ప్రజాజ్యోతి):**

నాణ్యమైన విత్తనోత్పత్తితోనే అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధ్యమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో చేపట్టిన ప్రాజెక్టులో భాగంగా ఆందోల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సంగారెడ్డి ఆధ్వర్యంలో వరి విత్తనోత్పత్తిలో పాటించాల్సిన మెలకువలపై సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా కేఎన్ఎం-1638 రకం వరి విత్తనోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తనోత్పత్తిని ఒక ప్రత్యేక పంటగా భావించి ప్రతి దశలో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు.

### ధ్రువీకరించిన మూల విత్తనమే కీలకం

విత్తన ధ్రువీకరణ అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. విత్తనోత్పత్తికి ధ్రువీకరించిన మూల విత్తనాన్ని మాత్రమే ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇతర రకాలతో కలిసిపోకుండా తగిన దూరం పాటిస్తూ పొలాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. పంట పెరుగుతున్న దశలో తరచూ పొలాన్ని పరిశీలించి ఇతర రకాల మొక్కలు, కలుపు మొక్కలను గుర్తించి తొలగించాలని



చెప్పారు. పుష్పించే దశతో పాటు కోతకు ముందు రోగింగ్ నిర్వహించడం ద్వారా ఇతర రకాల మొక్కలను తొలగించి విత్తనంలో జన్యుపరమైన స్వచ్ఛతను కాపాడుకోవచ్చని వివరించారు. కోత సమయంలో ఇతర రకాల విత్తనాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, కోత అనంతరం విత్తనాన్ని శుభ్రపరిచి తేమ శాతాన్ని తగ్గించి శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేయాలని సూచించారు.

### రైతులకు నాణ్యమైన విత్తనం అందుబాటులోకి



జోగిపేట ఏడీఏ ఉమాదేవి మాట్లాడుతూ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా విత్తనోత్పత్తిని చేపట్టడం వల్ల భవిష్యత్‌లో రైతులకు నాణ్యమైన విత్తనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విత్తనోత్పత్తి చేసే రైతులు ప్రతి దశలో తగిన మెలకువలు పాటించి నాణ్యతా ప్రమాణాలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లేశం, సెక్రటరీ భరత్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

---

# వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

## భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, పంట కుంటలపై దృష్టి



**అందోల్, సెప్టెంబర్28, (ప్రజాజ్యోతి):**

వర్షపు నీటిని వృథాగా వదలకుండా ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకునేలా గ్రామాల్లో విస్తృతంగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని అదనపు డీఆర్‌డీఓ బాల్‌రాజ్ సూచించారు. చౌటకూర్ మండలం బొమ్మరెడ్డిగూడెం గ్రామంలో సోమవారం ఏపీడీ మధులతతో కలిసి పర్యటించిన ఆయన, గ్రామంలో కొనసాగుతున్న ఫారం పాండ్ పనులను పరిశీలించారు.

### 375 పనుల్లో ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యం

వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా గ్రామానికి కేటాయించిన 375 కొత్త పనుల్లో రైతులకు, గ్రామ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను గుర్తించాలని బాల్‌రాజ్ సూచించారు. గ్రామ సభలో



చర్చించి తీర్మానం ద్వారా అవసరమైన పనులను ప్రతిపాదించాలని అధికారులకు, గ్రామ ప్రజలకు సూచించారు. కేవలం పనుల సంఖ్యపై కాకుండా గ్రామ భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల కల్పనపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

### ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత.. ప్రతి పొలానికీ నీటి భద్రత

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో నీటి సంరక్షణ ఉద్యమంగా సాగాలని ఆయన అన్నారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, పంట కుంట, ఊట కుంట, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని సాధ్యమైనంత మేర భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటే భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు వేసవిలో బోరుబావులు ఎండిపోకుండా కొంతమేర రక్షణ లభిస్తుందని వివరించారు. పంటలకు అవసరమైన సమయంలో నీటి లభ్యత పెంచేందుకు నీటి సంరక్షణ పనులు కీలకమని తెలిపారు.



### ఇంటివద్దే చెత్త వేరు చేయాలి

గ్రామ పరిశుభ్రతపై కూడా అధికారులు దృష్టి సారించారు. ప్రతి కుటుంబం తమ ఇళ్ల వద్దనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని బాల్‌రాజ్ సూచించారు. పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, పచ్చదనం వంటి అంశాల్లో ప్రజల భాగస్వామ్యంతో బొమ్మరెడ్డిగూడెంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ మధులత, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్, ఏపీవో రామ్మోహన్, ఈసీ మహేశ్వర్‌రెడ్డి, టీసీ ప్రతాప్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టయ్య, వార్డు సభ్యులు మేనక, గణేష్, జీవవైవిధ్య పరిరక్షణ కమిటీ సభ్యులు మూడ్ శివాజీ, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బ్లాస్టింగ్ బీభత్సం.. క్రషర్ల దుమారం

## - మాదారం గ్రామం చుట్టూ స్టోన్ క్రషర్ల మోత- పేలుళ్ల ప్రకంపనలకు ఇళ్లకు పగుళ్లు
## - దుమ్ము, ధూళితో పంటలు.. ప్రజల ఆరోగ్యంపై ఆందోళన
## - రాత్రింబవళ్లు క్రషింగ్‌తో కంటి మీద కునుకు కరువు- రాయల్టీ వ్యవహారంపైనా గ్రామస్థుల ఆరోపణలు
## - కలెక్టర్‌కు ఫిర్యాదు.. సమగ్ర విచారణకు డిమాండ్







**జిన్నారం,(ప్రజాజ్యోతి)**

ఒకవైపు బండరాళ్లను పిండి చేస్తున్న క్రషర్ల హోరు.. మరోవైపు రాత్రింబవళ్లు బ్లాస్టింగ్ ప్రకంపనలు.. ఇంకోవైపు దుమ్ము, ధూళితో కమ్ముకుంటున్న పరిసరాలు.. ఇదీ జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామ సమీపంలో నెలకొన్న పరిస్థితి లపై మాధారం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 210లో నిర్వహిస్తున్న రాక్సాండ్, ఏఏఏ స్టోన్ క్రషర్ యూనిట్లు నిబంధనలు ఉల్లంగించాయంటూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. క్రషర్ యూనిట్ల నిర్వహణ, బ్లాస్టింగ్, పర్యావరణ పరిరక్షణ, రాయల్టీ చెల్లింపులు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

**పేలుళ్లతో ఇళ్లకు పగుళ్లు..**

క్రషర్ యూనిట్లకు సంబంధించిన బ్లాస్టింగ్ కారణంగా పెద్ద శబ్దాలు, ప్రకంపనలు వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ప్రకంపనలతో ఇళ్ల గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, పేలుళ్ల సమయంలో ఇళ్లలోని వస్తువులు కంపించడం, భారీ శబ్దాలతో చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రాత్రి సమయాల్లోనూ క్రషింగ్, బ్లాస్టింగ్ జరుగుతోందని, దీంతో ప్రశాంతంగా జీవించే పరిస్థితి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి..**

స్టోన్ క్రషింగ్ సమయంలో పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి వెలువడుతోందని గ్రామస్థులు తెలిపారు. గాలికి దుమ్ము పరిసర ప్రాంతాల్లోకి చేరడంతో ఇళ్లు, రహదారులు, వ్యవసాయ పొలాలు దుమ్ముతో కప్పుకుపోతున్నాయని చెప్పారు. క్రషర్ వాహనాలు రోడ్డు పై నిరంతరం తిరగడం వల్ల రోడ్లపై దుమ్ము మరింతగా ఎగసిపడుతోందన్నారు. ప్రజలు ముక్కు, నోరు కప్పుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోయారు.

**పంట పొలాలపైనా ప్రభావం..**

క్రషర్ల నుంచి వెలువడుతున్న దుమ్ము సమీపంలోని వ్యవసాయ భూములపై పేరుకుపోతోందని రైతులు ఆరోపించారు. పంటలపై దుమ్ము పొర ఏర్పడటంతో పంటల పెరుగుదల, దిగుబడిపై ప్రభావం పడుతోందని తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తమకు క్రషర్ కార్యకలాపాల వల్ల నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వ్యవసాయ శాఖతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని కోరారు.

**రాయల్టీ చెల్లింపులపై అనుమానాలు..**

క్రషర్ యూనిట్ల నిర్వహణతోపాటు రాళ్ల తవ్వకం, తరలింపు, రాయల్టీ చెల్లింపుల విషయంలోనూ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలను గ్రామస్థులు చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ పూర్తిస్థాయిలో చెల్లిస్తున్నారా? అనుమతించిన పరిమితుల్లోనే ఖనిజాన్ని వెలికితీస్తున్నారా? అనే అంశాలపై అధికారులు రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టాన్ని కూడా లెక్కించాల్సిన అవసరం ఉందన్నారు.

**అధికారుల తనిఖీలెక్కడ?**

క్రషర్ యూనిట్ల వల్ల ఇన్ని సమస్యలు ఎదురవుతున్నా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. బ్లాస్టింగ్‌కు సంబంధించిన అనుమతులు, క్రషర్ నిర్వహణకు ఉన్న అనుమతులు, కాలుష్య నియంత్రణ చర్యలు, రాయల్టీ చెల్లింపులు, వాహనాల రాకపోకలు తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని కోరారు.

**కలెక్టర్ దృష్టి సారించాలని విజ్ఞప్తి**

మాదారం గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి క్రషర్ యూనిట్లను తనిఖీ చేయాలని కోరారు. బ్లాస్టింగ్ వల్ల ఇళ్లకు నష్టం జరిగినట్లు తేలితే బాధితులను గుర్తించి న్యాయం చేయాలని, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సీతారం యాదవ్, మల్లేష్, కుమార్, భజరంగ్ సింగ్, నరసింహ, గణేష్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

---

# సన్మార్గంలో సాగుదాం..!

## - ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, మాణికరావు
## - భక్తిశ్రద్ధలతో లక్ష జప యజ్ఞం





**జహీరాబాద్, సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి న్యూస్)**

ప్రతి ఒక్కరూ ఇతరులకు హాని కలిగించ కుండా ధర్మమార్గంలో నడవాలని, గురువులు చూపిన సన్మార్గాన్ని అనుసరించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం లో లోకకల్యాణం, రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన శత సహస్ర లక్ష జప యజ్ఞంలో పాల్గొన్నారు. ముందుగా వారికి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. జ్యోతిర్లింగా లకు రుద్రాభిషేకం, మహామంగళ హారతి నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధి పతులు అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వరా నందగిరి మహారాజ్, స్థానిక నాయకులతో కలిసి లక్ష జప యజ్ఞంలో పాల్గొని పూర్ణా హుతి నిర్వహించారు. మహ మంగళారతి నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఝరాసంగం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ సుజిత విశ్వేశ్వర్, గ్రామ సర్పంచ్ రాజుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి ..

## – జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్







**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించి, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు . ప్రజావాణిలో మొత్తం 65 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు12 , నారాయణఖేడ్ డివిజన్‌కు 05,జహీరాబాద్ డివిజన్‌కు 05,అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని , కలెక్టరేట్‌కు 43 దరఖాస్తులు అందాయని, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు.ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్,పెన్షన్లు, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్ ,మిషన్ భగీరథ గ్రిడ్, పోలీస్,సోషల్ వెల్ఫేర్ ,సెర్వే & ల్యాండ్ రికార్డు , మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పి సి బి ,ఎల్ డి ఏం ,వైద్య ఆరోగ్య శాఖ .మునిసిపల్ శాఖలకు సంబందించిన పిర్యాదులు అందాయి . ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# పారిశ్రామిక పార్కు కోసం బలవంతపు భూసేకరణ వద్దు!

**-481 సర్వే నంబర్‌లో 12 ఎకరాల 7 గుంటల భూమి ఇచ్చేది లేదన్న 16 మంది రైతులు**

**- "భూమే మా జీవనాధారం..- మా బతుకులను బలిచేయొద్దు" తహసీల్దార్‌కు రైతుల వినతి..**






**కొండాపూర్ ప్రజా జ్యోతి**

కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం తమ భూములను బలవంతంగా సేకరించవద్దని 16 మంది రైతులు ప్రభుత్వాన్ని కోరారు. పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో భూసేకరణ అంశంపై తహసీల్దార్ అశోక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.మల్కాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 481లో 12 ఎకరాల 7 గుంటల భూమి పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు అవసరమని అధికారులు రైతులకు వివరించినట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించిన 16 మంది రైతులు గ్రామసభకు హాజరై తమ అభిప్రాయాలను అధికారుల ముందు వెల్లడించారు.

### "భూమే మా జీవనాధారం"

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ కుటుంబాల జీవనాధారం వ్యవసాయ భూములేనని తెలిపారు. తమకు ఇష్టంలేని విధంగా భూములను తీసుకోవద్దని కోరారు. "భూమే మా జీవనాధారం.. ఈ భూములపై ఆధారపడి మా కుటుంబాలను పోషించుకుంటున్నాం. మమ్మల్ని మా భూముల నుంచి విడదీయొద్దు. మా బతుకులను బలిచేయొద్దు.. మమ్మల్ని బతకనివ్వండి" అంటూ తహసీల్దార్ అశోక్‌కు వినతి చేశారు.తమ అంగీకారం లేకుండా భూములను సేకరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రైతులు స్పష్టం చేశారు.

### బలవంతపు చర్యలకు పాల్పడొద్దు: శ్రీధర్‌రెడ్డి

గ్రామసభలో బీఆర్ఎస్ మండల నాయకులు కొత్తకాపు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రభుత్వ అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చి రైతులకు అందిస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. కొండాపూర్ మండలంలోని మునిదేవునిపల్లి, అలియాబాద్, మహ్మదాపూర్ గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూములు తీసుకున్న సందర్భాలను ప్రస్తావించిన ఆయన.. ఆయా గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మల్కాపూర్ గ్రామంలోని దళిత రైతుల భూముల విషయంలోనూ రైతుల అభిప్రాయాలను గౌరవించాలని అన్నారు. రైతుల అంగీకారం లేకుండా బలవంతపు చర్యలకు పాల్పడితే రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల జీవనాధారమైన భూములను కాపాడేందుకు అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని అన్నారు.గ్రామసభలో ఆర్ఐ నిఖిల్, జీపీ ఓ రామదాస్, గ్రామ సర్పంచ్ అనిల్‌కుమార్, ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్ ప్రజలకు ఊరట.. తొలిసారిగా గ్రామంలోనే పెన్షన్ల పంపిణీ.. మర్క సంగన్న సర్పంచ్

**కల్హేర్, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:**

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల పరిధిలోని ఇందిరానగర్ గ్రామపంచాయతీలో తొలిసారిగా గ్రామంలోనే ఆసరా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో ఇందిరానగర్ గ్రామం, తండా ప్రజలు ఇకపై పెన్షన్లు తీసుకునేందుకు మార్డి గ్రామానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.గ్రామంలోనే పెన్షన్లు అందుబాటులోకి రావడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ప్రయాణ ఇబ్బందులు తగ్గనున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మర్క సంగన్న మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇందిరానగర్‌లోనే పెన్షన్ల పంపిణీ ప్రారంభించడం సంతోషకరమన్నారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా అందేలా కృషి చేస్తామని తెలిపారు.





# యూనిఫాం, షూస్, బెల్ట్‌తోనే పాఠశాలకు రావాలి

## - విద్యార్థులకు ఎంఈఓ బి. సురేష్ సూచన

**కల్హేర్, సెప్టెంబర్ 28, ప్రజా జ్యోతి:**

కల్హేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ బి. సురేష్ సోమవారం ఉదయం ప్రార్థనా సమయంలో సందర్శించి విద్యార్థుల హాజరు, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ప్రభుత్వం రూ.70 వేల వ్యయంతో విద్యార్థులకు అందించిన షూస్‌ను పలువురు విద్యార్థులు ధరించకపోవడంపై ఆయన ఆరా తీశారు.రేపటి నుంచి విద్యార్థులందరూ తప్పనిసరిగా పూర్తి యూనిఫాం, షూస్, బెల్ట్‌తో పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే యస్. ఏ -1 పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అలాగే మండలంలో డిజిటల్ లెర్నింగ్‌లో కొంత వెనుకబాటుతనం ఉందని పేర్కొన్న ఎంఈఓ, సంబంధిత పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేసి, వారిని డిజిటల్ లెర్నింగ్‌లో యాక్టివ్‌గా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు.



# అనుమతుల్లేని డీజేలపై పోలీసుల కొరడా

## - బీరంగూడలో మూడు డీజే వాహనాలు స్వాధీనం..

## - నిర్వాహకులపై కేసులు

**అమీన్ పూర్(ప్రజాజ్యోతి)**

వినాయక నిమజ్జనం సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్ నిర్వహించిన వారిపై అమీన్ పూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. బీరంగూడ ప్రభుత్వ పాఠశాల సమీపంలోని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ ఇంటి వద్ద మూడు డీజే వాహనాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు.పోలీసుల వివరాల ప్రకారం డీజేలు, భారీ డిజిటల్ స్క్రీన్ లు సెప్టెంబర్ 27 సాయంత్రం 5 గంటల నుంచి 28వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటల వరకు నిర్వహించారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడంతో ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు శబ్ద కాలుష్యం, ప్రజాశాంతికి భంగం వాటిల్లినట్లు పోలీసులు తెలిపారు. రోడ్డుపై భారీ డిజిటల్ స్క్రీన్ లు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్‌ను మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పెట్రోలింగ్‌లో భాగంగా బీరంగూడ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న అమీన్ పూర్ పోలీసులకు ఈ విషయం గుర్తించడంతో మూడు డీజే వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై నందారం నరసింహా గౌడ్, సంబంధిత డీజే యజమానుల ఆపరేటర్ లపై బిఎన్ఎస్ సెక్షన్ లు 223, 285, 270, 292, 126(2) రీ/వ 3(5) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వినాయక నిమజ్జన వేడుకల్లో శాంతిభద్రతలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.

# ఎరువులు,పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు





**రాయికోడ్ సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుమందుల విక్రయ దుకాణాల్లో రాయికోడ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఎరువులు, పురుగుమందుల నిల్వలు, విక్రయాల నిర్వహణను పరిశీలించారు.దుకాణాల్లో నిబంధనల ప్రకారం స్టాక్ వివరాల నిర్వహణ, ఎరువులు, పురుగుమందుల ధరల ప్రదర్శన, రైతులకు తప్పనిసరిగా బిల్లులు జారీ చేస్తున్నారా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలించారు. నిబంధనలను సక్రమంగా పాటించని దుకాణదారులకు తగిన సూచనలు చేస్తూ, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందేలా వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని శ్రీనివాస్ ప్రసాద్ సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా విక్రయాలు నిర్వహించాలని తెలిపారు.ఈ తనిఖీల్లో రాయికోడ్ మండల వ్యవసాయ అధికారి సారిక పాల్గొన్నారు.

# కూలుతున్న డివైడర్లు

## - ప్రధాన రహదారిపై శిథిలమవుతున్న డివైడర్లు

## - పగుళ్లు ఏర్పడి కూలుతున్న వైనం

## - మున్సిపల్ అధికారుల పట్టింపు ఎక్కడ

**జహీరాబాద్, సెప్టెంబర్ 28(ప్రజా జ్యోతి న్యూస్)**

పట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్లు తరుచూ కూలిపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ డివైడర్లు శిథిలావస్థకు చేరుకోవడం నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలకు తావిస్తోంది. బాగారెడ్డి విగ్రహం సిగ్నల్ సమీపంలో, అదేవిధంగా జేసీ బ్రదర్ ముందు ఉన్న సిగ్నల్ మలుమలుపు వద్ద డివైడర్లు దెబ్బతిన్న స్థితిలో కనిపిస్తున్నాయి. నిర్మాణం లో నాణ్యత లేని సామాగ్రి వినియోగించడం, సరైన ప్రమాణాలు పటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రోడ్డు మధ్యలో దెబ్బతిన్న డివైడర్లు పగుళ్లు ఏర్పడి కూలుతు ఉండటం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రాత్రి సమయంలో డివైడర్ల శిథిలాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున దెబ్బతిన్న డివైడర్లకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, అంతేకాకుండా నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టు చేయాలని, ఇకపై ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం, సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు..



# విద్యార్థులతో మాక్ పార్లమెంట్.. ప్రజాస్వామ్యంపై అవగాహన

## - చట్టసభల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్న విద్యార్థులు

**వట్పల్లి, సెప్టెంబర్ 28, (ప్రజాజ్యోతి):**

విద్యార్థుల్లో పార్లమెంటరీ విధానాలు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు వట్పల్లి మండల కేంద్రంలోని పోతులబోగుడ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో సోమవారం మాక్ పార్లమెంట్, మాక్ అసెంబ్లీ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.దీనా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్పీకర్, పార్లమెంట్ సభ్యులు, మంత్రులు తదితర పాత్రలను పోషించారు.ఈ సందర్భంగా విద్యార్థులు చట్టసభల్లో జరిగే చర్చలు, ప్రశ్నోత్తరాల విధానం, తీర్మానాల ప్రవేశపెట్టడం, సభ్యుల బాధ్యతలు వంటి అంశాలను మాక్ పార్లమెంట్ ద్వారా ప్రదర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభల ప్రాధాన్యత, ప్రజా సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే విధానాన్ని విద్యార్థులకు ప్రాయోగికంగా వివరించారు.పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, మాట్లాడే నైపుణ్యం, సమస్యలపై అవగాహన, బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తి పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# టీజేడబ్ల్యూఎఫ్ నారాయణఖేడ్‌కు కొత్త సారథ్యం.. అధ్యక్షుడిగా పుట్టి సంజీవ్ కుమార్

## - వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిరదర్ ప్రతాప్.. - జనరల్ సెక్రటరీగా యం.డి.కైసర్







**కల్హేర్/నారాయణఖేడ్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీజేడబ్ల్యూఎఫ్) నారాయణ ఖేడ్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణఖేడ్ పట్టణంలో నిర్వహించిన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.నూతన అధ్యక్షుడిగా పుట్టి సంజీవ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిరదర్ ప్రతాప్, జనరల్ సెక్రటరీగా కైసర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పండ్లిక్, దత్తు గౌడ్, రవి వర్మ, సిద్రం, శరణప్ప, మారుతి, ఆంజనేయులు, సంతోష్, సుదర్శన్, ఉదయ పాటిల్, సంగారెడ్డి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా సతీష్, నాగిశెట్టి, డానియల్, మోహన్, ఫయాజ్, ప్రవీణ్ కుమార్, అంజద్ అలీ బేగ్ కల్హేర్, జలీల్ రుస్తుం, సంగ్రామ్, విశ్వనాథ్, సంతోష్ రెడ్డి, శంకర్, శాయాబాజ్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఇబ్రహీం ఖాన్, పీఆర్వోగా కాశీనాథ్, కార్యవర్గ సభ్యులుగా సంతోష్ కుమార్, యశోదర్, సోహెల్, మజార్, ఆనంద్ ఎన్నికయ్యారు.ఈ ఎన్నికల కార్యక్రమంలో టీజేడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ. రఘు, రాష్ట్ర నాయకులు బి. రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగాల మాణిక్ ప్రభు, మేకల కృష్ణయ్య, పాండు, రాజా గౌడ్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.నూతన కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర, జిల్లా నాయకులు, జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల



సమస్యల పరిష్కారంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు..

# తొగర్పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నమూనా పార్లమెంట్ సమావేశం.. పార్లమెంటరీ విధానాలపై విద్యార్థులకు అవగాహన..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**




జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొగరుపల్లిలో విద్యార్థులతో నమూనా పార్లమెంట్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఏ విధంగా పరిపాలన కొనసాగిస్తుంది, పార్లమెంట్‌లో పాలక పక్షం, ప్రతిపక్షం పాత్రలు ఎలా ఉంటాయనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ నమూనా పార్లమెంట్‌లో యూసుఫ్ బాబా స్పీకర్‌గా, నైనిక ప్రధానమంత్రిగా, మీనాక్షి విద్యాశాఖ మంత్రిగా, మౌనిక ఆర్థిక మంత్రిగా, రిషిత ఆరోగ్యశాఖ మంత్రిగా, సురేష్ రవాణాశాఖ మంత్రిగా, గుండప్ప వ్యవసాయశాఖ మంత్రిగా, క్రీస్తు రాజు పర్యావరణశాఖ మంత్రిగా వ్యవహరించారు. ప్రతిపక్ష సభ్యులుగా కృష్ణవేణి, నీలవేణి, శివాని, మధు, సఫేనా, విష్ణుసాయి, రేవంత్, నవాజ్, ఐషు తదితర విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.విద్యార్థులు తమకు కేటాయించిన పాత్రలను సమర్థవంతంగా పోషిస్తూ సభా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రశ్నలు అడగడం, సమాధానాలు ఇవ్వడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం వంటి అంశాల ద్వారా పార్లమెంటరీ విధానాలను ఆచరణాత్మకంగా తెలుసుకున్నారు.

### భావి జీవితానికి ఉపయోగకరం

నమూనా పార్లమెంట్ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, బాధ్యతాయుత పౌరసత్వం, ప్రశ్నించే తత్వం, సామాజిక అవగాహన పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి అవసరమైన అవ గాహన పొందారని పేర్కొన్నారు .కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు బహు మతులను అందజేశారు. విద్యా ర్థులను కార్యక్రమానికి సిద్ధం చేసిన ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసాద్తో పాటు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల కృషిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సి. దశరథ్ అభినందించారు.నమూనా పార్లమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

# రాష్ట్రీయ సేవా రత్న అవార్డుతో అబ్దుల్ రహీంకు సత్కారం

## 15 ఏళ్ల రాజ్యాంగ, మానవ హక్కుల పరిరక్షణ సేవలకు గుర్తింపు

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి:** నాగల్‌గిద్ద మండలం ఎస్గి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు అబ్దుల్ రహీంకు ప్రతిష్టాత్మక 'రాష్ట్రీయ సేవా రత్న అవార్డు' లభించింది. రాజ్యాంగ పరిరక్షణ, మానవ హక్కులు, బాలల హక్కులు, రైతుల సంక్షేమం కోసం గత 15 ఏళ్లుగా ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందించారు. హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ప్రముఖ సామాజిక సేవా సంస్థ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక మహాసభలో ఈ అవార్డును ప్రదానం చేశారు. హెల్పింగ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శిరీష రెడ్డి చేతుల మీదుగా అబ్దుల్ రహీం పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం అంబేద్కర్ పూలే సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్‌గా, రైతు సంక్షేమ సమితి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ రహీం బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా అబ్దుల్ రహీం మాట్లాడుతూ.. ఎస్గి గ్రామంలోని పేద కుటుంబంలో జన్మించిన తనకు సామాన్యులు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలు ప్రత్యక్షంగా తెలుసన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని 15 ఏళ్లుగా రాజ్యాంగ రక్షణ, మానవ హక్కుల పరిరక్షణ, బాలల హక్కులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.రాజ్యాంగ పరిరక్షణతో పాటు ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం కల్పించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగిన ప్రతిచోటా బాధితులకు అండగా నిలుస్తానని, రైతుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతానని అన్నారు. తన సేవలను గుర్తించి అవార్డు అందించిన హెల్పింగ్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.గతంలో అందుకున్న జాతీయ అంబేద్కర్ అవార్డుతో పాటు తాజాగా లభించిన రాష్ట్రీయ సేవా రత్న అవార్డులు తన బాధ్యతను మరింత పెంచాయని అన్నారు. ప్రజా సేవలో చివరి శ్వాస వరకు కొనసాగుతానని



తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ ఫౌండేషన్ జాతీయ, రాష్ట్ర నాయకులు, సినీ రంగ ప్రముఖులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మేధావులు, న్యాయ నిపుణులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని అబ్దుల్ రహీంను అభినందించారు.

## గణేష్ నవరాత్రులకు ఇంటికొచ్చిన యువకుడు మిస్సింగ్.. పోలీసుల దర్యాప్తు

**కల్హేర్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):**

కల్హేర్ మండలం నాగ్ధర్ గ్రామానికి చెందిన కంది సుధాకర్ (23) అదృశ్యమైనట్లు కల్హేర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సుధాకర్ హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఈ నెల 18న నాగ్ధర్‌లోని తన ఇంటికి వచ్చిన సుధాకర్, ఈ నెల 27న ఉదయం సుమారు 9 గంటలకు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సుధాకర్ తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కల్హేర్ ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు..



# భక్తిశ్రద్ధల నడుమ.. గణపయ్యకు ఘన వీడ్కోలు

### - కన్సాన్‌పల్లిలో రెండు రోజుల పాటు అట్టహాసంగా నిమజ్జన వేడుకలు
### - యువత ఉత్సాహం.. మహిళల సందడి.. చిన్నారుల నృత్యాలతో మార్మోగిన గ్రామం

**అందోల్ సెప్టెంబర్ 28, (ప్రజాజ్యోతి):**

అందోల్ మండలం కన్సాన్‌పల్లి గ్రామంలోని ఈశ్వరాలయం వద్ద మహాదేవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 14 అడుగుల భారీ గణపయ్యకు భక్తిశ్రద్ధలతో ఘన వీడ్కోలు పలికారు. వినాయక చవితి సందర్భంగా ప్రారంభమైన ఉత్సవాలు నిమజ్జన వేడుకలతో వైభవంగా ముగిశాయి. రెండు రోజుల పాటు సాగిన నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమై సోమవారం మధ్యాహ్నం వరకు కొనసాగాయి.

**పండుగ వాతావరణం**

గ్రామంలోని మహాదేవ్ యూత్ అసోసియేషన్, హనుమాన్ యూత్ అసోసియేషన్, మహంకాళి యూత్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్యల ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూడు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులతో కన్సాన్‌పల్లి వీధులు సందడిగా మారాయి. డప్పుల మోత, డీజే పాటలు, భక్తుల నినాదాలతో గ్రామం మార్మోగింది.

**యువత సందడి.. చిన్నారుల నృత్యాలు**

నిమజ్జనోత్సవాల్లో మహిళలు, యువకులు, చిన్నారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోలాటాలు, డీజే పాటలకు చిన్నారుల నృత్యాలు, యువత ఉత్సాహంతో వేడుకలు మరింత కళకళలాడాయి. పలువురు యువకులు, చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించారు. గణపయ్యను దర్శించుకునేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ప్రధాన వీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది.





**భక్తి.. ఉత్సాహం కలగలిసిన వేడుక**

రెండు రోజుల పాటు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉత్సవాలను నిర్వహించేందుకు యువజన సంఘాల సభ్యులు సమన్వయంతో పనిచేశారు. భక్తి, సంప్రదాయం, యువత ఉత్సాహం కలగలిసిన నిమజ్జన వేడుకలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గణపయ్యకు జై అంటూ భక్తులు నినదిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# వట్పల్లి దాడి కేసులో ఆరుగురికి జైలు శిక్ష

### - పాత కక్షలతో మహిళను దూషించి..
### - భర్తపై కట్టెలతో దాడులు ఒక్కొక్కరికి
### ఆరు నెలల జైలు.. జరిమానా విధించిన అందోలుజోగిపేట కోర్టు

**వట్పల్లి, .. ప్రజా జ్యోతి సెప్టెంబర్ 28**

పాత కక్షల నేపథ్యంలో మహిళను దూషించి, ఆమె భర్తపై కట్టెలతో దాడి చేసి గాయపరిచిన కేసులో ఆరుగురు నిందితులకు న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. వట్పల్లి గ్రామంలో 2017లో చోటుచేసుకున్న ఈ ఘటనపై విచారణ జరిపిన అందోలుజోగిపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. నిందితులందరికీ ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ జరిమానా ఖరారు చేసింది.

**పాత కక్షలతో దాడి..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2017 సెప్టెంబర్ 15న ఉదయం 9 గంటల సమయంలో వట్పల్లి గ్రామానికి చెందిన పల్లె సుమిత్రాబాయి తన భర్త కిషన్‌రావు కోసం టిఫిన్ బాక్స్ తీసుకొని వట్పల్లి చౌరస్తాలోని కిరాణా దుకాణం వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బాపోళ్ల లక్ష్మి, బాపోళ్ల అనిత పాత కక్షలను మనసులో పెట్టుకొని ఆమెను దూషించారు. ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించడంతో చంపుతామని బెదిరించారు.దీంతో భయపడిన సుమిత్రాబాయి కిరాణా దుకాణంలోకి వెళ్లి తన భర్తకు జరిగిన విషయాన్ని చెబుతుండగా.. బాపోళ్ల పండురావు, బాపోళ్ల రాజారావు, బాపోళ్ల వెంకట్‌రావు, నిట్లూరు విట్టల్ కట్టెలతో అక్కడికి వచ్చి కిషన్‌రావుపై దాడి చేసి గాయపరిచారు. చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు జోక్యం చేసుకొని వారిని విడిపించారు.

**ఎనిమిదేళ్ల తర్వాత వెలువడిన తీర్పు**

బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి వట్పల్లి ఎస్ఐ కె. గణేష్ కేసు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 19/2017గా ఐపీసీ 452, 324, 504, 506, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 2017 సెప్టెంబర్ 17న ఆరుగురు నిందితులకు నోటీసులు జారీ చేశారు. దర్యాప్తు పూర్తి చేసి అదే ఏడాది అక్టోబర్ 30న కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు.కేసు విచారణలో ఇరుపక్షాల వాదనలు విన్న అందోలుజోగిపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. మహమ్మద్ అసదుల్లా షరీఫ్ అసద్.. ఆరుగురు నిందితులకు శిక్షలు విధిస్తూ 2026 సెప్టెంబర్ 28న తీర్పు ఇచ్చారు.

**నిందితులకు విధించిన శిక్షలు**

బాపోళ్ల లక్ష్మి (ఏ1), బాపోళ్ల అనిత (ఏ2): ఒక్కొక్కరికి రూ. 2,000 జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష.వు (ఏ4), బాపోళ్ల వెంకట్‌రావు (ఏ5), నిట్లూరు విట్టల్ (ఏ6): ఒక్కొక్కరికి రూ. 4,000 జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష.ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ టి. లతీఫ్ ఉర్ రెహమాన్ వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు అధికారి కె. గణేష్, ప్రస్తుత వట్పల్లి ఎస్‌హెచ్‌ఓ పి. లక్ష్మీకాంత్ రెడ్డి, కోర్టు డ్యూటీ పోలీస్ సిబ్బంది బి. భాస్కర్ తదితరులు కేసు ప్రక్రియలో పాల్గొన్నారు.ი "చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడితే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సిందే. నేరం చేసిన వారికి శిక్ష పడటం ద్వారా బాధితులకు న్యాయం జరిగి, సమాజంలో చట్టంపై నమ్మకం మరింత బలపడుతుంది.

# ఓటు చోరీపై కాంగ్రెస్ పోరుబాట

## - ఎన్నికల సంఘం తీరుపై నిరసన.. సంగారెడ్డి ధర్నాకు తరలిరావాలని పిలుపు.

## - తండోపతండాలుగా సంగారెడ్డికి వెళ్లిన కల్హే ర్ మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు







**కల్హేర్, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):**

ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బలహీన, బడుగు వర్గాలకు చెందిన అర్హులైన ఓటర్లకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ పిలుపు మేరకు సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కల్హేర్ మండల కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకుల ఆరోపణల ప్రకారం.. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్ల విషయంలో అనేక అభ్యంతరాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్‌కుమార్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ నేతలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ఆయనను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ శెట్కార్, ఆయన తండ్రి శివరావు శెట్కార్ పేర్ల విషయంలోనూ నోటీసులు జారీ చేయడం జరిగిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మూడు పర్యాయాలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన నాయకులకే ఓటర్ల జాబితా అంశంలో ఇబ్బందులు ఎదురైతే, సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని వారు అన్నారు. ఈ నేపథ్యంలో "ఓటు చోరీ"పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు నిరసనగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు . జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు పలువురు అభిమానులు తండోపతండాలుగా వచ్చి ధర్నా విజయవంతం చేయడం గొప్ప శుభ పరిణామం అని కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు.

# ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి

## - రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆహారం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి:

## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :-**

రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, ఆరోగ్యం, భద్రత కల్పించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు మాత్రమే కాకుండా ప్రత్యేక అధికారులు కూడా క్షేత్రస్థాయిలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు.సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి విద్యాశాఖకు సంబంధించిన పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఎస్ మాట్లాడుతూ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, ఆహార పదార్థాల నిల్వ, వంటశాలల పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితుల పర్యవేక్షణకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను క్రమం తప్పకుండా పరిశీలించి, విద్యా సంస్థల్లోని సౌకర్యాలు, లోపాలు, చేపట్టిన చర్యలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దసరా పండుగ నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫారాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.